


## • ట్యాంకర్ నీటితోనే మడి తడిసేది

కొమురవెల్లి, ఫిబ్రవరి 24 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా నీటి కష్టాలు మొదలయ్యాయి. పక్కనే కూత వేటు దూరంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా గురువన్నపేట రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. గ్రామానికి చెందిన పుట్ట వెంకట్ అనే రైతు 3 ఎకరాల్లో వరి వేయగా, నీళ్లు అందకపోవడంతో పంట ఎండిపోతున్నది. వరిని ఎలాగైనా బతికించుకోవాలని నీళ్ల ట్యాంకర్ ద్వారా సోమవారం పంటకు నీళ్లను పెట్టిండు. తాను ఆరేండ్ల క్రితం బోరు వేశానని, మొత్తం 3 ఎకరాలు నీరు పారేదని, ఈ సారి మాత్రం కండ్ల ముందే పంటకు నీళ్లు అందడం లేదని రైతు వాపోయాడు.

## • పంట రుణం చెల్లించలేదని .. రైతు భూమిలో ఎర్రజెండాలు

సంగెం, ఫిబ్రవరి 24 : పంట రుణం చెల్లించలేదని బ్యాంకు అధికారులు రైతు భూమిలో ఎర్ర జెండాలు పాతిన ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బ్యాంకు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్గూర్‌స్టేషన్ తండాకు చెందిన రైతు గుగులోత్ మురళి మూడేండ్ల క్రితం రూ. 2లక్షల పంట రుణం తీసుకున్నాడు. ఎన్ని సార్లు వెళ్లినా రుణం చెల్లించకపోవడంతో భూమిని ఐడెంటిఫై చేసి జెండాలు పాతినట్టు పేర్కొన్నారు.



## • భూసర్వే అడ్డగింత



నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేపల్లి శివారులో భూసర్వే చేపట్టిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. కాట్రేపల్లి రైతు వెంకటేశ్‌గౌడ్ పెట్రోల్ బాటిల్‌తోవచ్చి సర్వే ఆపకుంటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. తమ భూములను ఇండస్ట్రియల్ పార్కు కోసం ఇచ్చేది లేదని పెద్దపల్లి జిల్లా రత్నాపూర్ రైతులు ఎంజాయిమెంట్ సర్వేను అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం మేడిపల్లి శివారులోని భూములను తీసుకునేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఫీల్డ్ మీదకు వచ్చిన రెవెన్యూ అధికారులను రైతులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెళ్లిపోయారు. – రామగిరి/ మక్తల్



## సాగునీటికి రైతులతో కలిసి ఉద్యమిస్తాం

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 24: సాగునీటి కోసం రైతుల కలిసి ఉద్యమిస్తామని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం చేర్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి విడుదలపై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ధర్మసాగర్ నుంచి గండిరామరం వరకు ఫేజ్-2లోని రెండు మోటర్లు ఆన్‌చేసి బొమ్మకూరు, వెల్దండ, కన్నెబోయినగూడెం, లద్నూర్ రిజర్వాయర్లను నింపి, తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేర్యాల డివిజన్‌లో తపాస్‌పల్లి రిజర్వాయర్ కింద ఉన్న చెరువులు, కుంటలు, ఆయకట్టు తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఫిబ్రవరిలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రస్తుతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గతంలో 200 నుంచి 300 ఫీట్ల లోతు బోర్లు వేస్తే సమృద్ధిగా నీళ్లు వచ్చేవని, ప్రస్తుతం 800 ఫీట్ల లోతులో బోరు వేసినా నీరు రావడం లేదన్నారు. దేవాదుల ప్రాజెక్టులోని ఆపరేషన్, మెయింటెనెన్స్ సిబ్బంది వేతనాల కోసం సమ్మెకు దిగడంతో పదిహేను రోజులు మోటర్లను నిలిపివేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దీనిపై తాను మాట్లాడితే చివరికి ప్రభుత్వం వారికి వేతనాలు చెల్లించినట్లు తెలిపారు. కొంతమంది ఎమ్మెల్యే నీళ్లు తేవడం లేదని అజ్ఞానంతో మాట్లాడుతున్నారని, తానే స్వయంగా అధికారులు, మంత్రులతో మాట్లాడి మోటర్లు ఆన్ చేయించిచడంతో ప్రస్తుతం గండిరామారం నుంచి 10 క్యూబిక్ నీళ్లు వస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల్లో తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్లు విడుదల చేయనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి మాత్రమే ఆలేరుకు నీళ్లు వెళ్తున్నాయని తెలిపారు.

# మళ్లీ యూరియా గోస!




జగిత్యాల జిల్లా కేంద్రంలోని సహకార సంఘం వద్ద క్యూ లైన్లో ఆధార్ కార్డు, పాసుబుక్కులు పెట్టి నిల్చున్న రైతులు

మొదటిపేజీ తరువాయి...

కేంద్రం నుంచి రావాల్సిన ఎరువుల కోటా రావడం లేదు. దీంతో రోజురోజుకూ రైతులకు యూరియా ఇబ్బందులు పెరిగిపోతున్నాయి.

### పోలీసుల టోకెన్లు.. క్యూలో చెప్పులు

కాంగ్రెస్ సర్కారులో నాడు, నేడు రైతులకు ఎరువుల తిప్పలు తప్పడం లేదు. నాడు పోలీస్ పహారాలో పోలీస్ స్టేషన్లలో ఎరువులను పెట్టి అమ్మిన సందర్భాలున్నాయి. రోజుల తరబడి క్యూలో పడిగాపులు కాస్తే ఒక్క బస్తా దొరకడమే గగనమయ్యే పరిస్థితులుండేవి. యూరియా కోసం రైతుల రాస్తారోకోలు, ధర్నాలు నిత్యకృత్యంగా ఉండేవి. పలు సందర్భాల్లో రైతులపై పోలీసుల లాఠీలు విరిగిన పరిస్థితులు కూడా ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎరువుల ఇబ్బందులు తప్పాయి. నాటి ప్రభుత్వ ముందు చూపుతో ఎప్పుడు అవసరమైనా నిల్వలు అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు పాత రోజులు మళ్లీ వచ్చాయి. యూరియా కోసం క్యూలో చెప్పులు, పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు దర్శనమిస్తున్నాయి.. రైతుల ధర్నాలు కొనసాగుతున్నాయి. మహబూబాబాద్‌లో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేశారు. జగిత్యాలలో రైతుల పాస్ పుస్తకాలను క్యూలో పెట్టారు. మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా అయ్యే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. రెండు, మూడు రోజులకోసారి ఒక్క లారీ వస్తే నిమిషాల్లోనే ఖాళీ అవుతున్నది. ముందున్న రైతులకు ఒక బస్తా రెండు బస్తాలు లభిస్తే వెనకాల రైతులకు ఒక్క బస్తా కూడా దొరకడం లేదు.

### రైతుల తిప్పలు.. గాడి తప్పిన ఎవుసం

ఒక్క బస్తా యూరియా కోసం రైతులు తమ వ్యవసాయ పనులను వదిలేసి గంటల తరబడి షాపుల వద్ద క్యూలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యవసాయ పనులు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సకాలంలో యూరియా లభించక పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. చేతికొస్తున్న పంటకు యూరియా అందక దిగుబడులు తగ్గే ప్రమాదం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు.

### 4 లక్షల టన్నులని గొప్పలు.. ఇప్పుడు నిల్

మొన్నటి వరకు రాష్ట్రంలో యూరియా కొరత ఉన్నదంటూ పలు పత్రికల్లో వచ్చిన కథనాలను, ఫొటోలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు హేళన చేశారు. అదంతా ప్రతిపక్ష పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయన్నట్టుగా మాట్లాడారు. తమ వద్ద ఎప్పుడు లేని విధంగా సుమారు 4 లక్షల టన్నుల యూరియా బఫర్ నిల్వలు ఉన్నాయని డబ్బా కొట్టారు. వాస్తవ పరిస్థితిని అంచనా వేయడంలో విఫలమయ్యారు. తీరా పది రోజుల తర్వాత చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత పట్టి పీడిస్తున్నది. మార్క్‌ఫెడ్ వద్ద 4 లక్షల టన్నులు ఉన్నాయని చెప్పుకొన్న నిల్వలు, 50 వేలకు పడిపోయాయి. అది కూడా ఎక్కడెక్కడ ఉన్నదో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఈ నిల్వలను కొరత ఉన్న చోటుకు తరలించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఇక్కడి స్టాక్‌ను అక్కడికి, అక్కడి స్టాక్‌ను ఇక్కడికి తిప్పుతున్నారు. కానీ కొరత మాత్రం తీరడం లేదు.

### పర్యవేక్షణలో ఫెయిల్

యూరియా కొరతపై ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవసాయ శాఖ పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన కోటాను సకాలంలో తేవడంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన కోటా రావడం లేదంటూ స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావే అంగీకరించారు. కేంద్రం నుంచి 8.54 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా 6.81 లక్షల టన్నులు మాత్రమే వచ్చినట్టు వెల్లడించారు. కోటా కన్నా 1.73 లక్షల టన్నుల యూరియా తక్కువ రావడం గమనార్హం. వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో నాటి సీఎం కేసీఆర్ అధికారులను ముందస్తుగా అలర్ట్ చేసి ఢిల్లీకి పంపి కేంద్రంతో సంప్రదింపులు జరిపించేవారు. కొన్నిసార్లు అధికారులు 3,4 రోజులు ఢిల్లీలోనే ఉండి రాష్ట్రానికి అవసరమైన కోటాను విడుదల చేయించుకునే వారు. కానీ ప్రస్తుతం ఈ విధానం లేదని తెలిసింది. ఇక్కడ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు జీఏడీ పొలిటికల్ బాధ్యతలతో బీజీ అయిపోగా డైరెక్టర్ గోపి రెండు అదనపు శాఖలతో బీజీ అయ్యారు. దీంతో ఢిల్లీ వెళ్లి కేంద్రంతో మాట్లాడేవారే కరువయ్యారనే విమర్శలున్నాయి. ఇలాకేంద్రం నుంచి ఎరువులు తేవడం, ఇక్కడి నిల్వలను పర్యవేక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మండుటెండల్లో రైతులు.. మొద్దు నిద్రలో సర్కారు

### యూరియా సరఫరాలో ప్రభుత్వం ఫెయిల్ : హరీశ్ ఫైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : రైతులు యూరియా కోసం మండుటెండల్లో తంటాలు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. జగిత్యాలలో యూరియా కోసం రైతులు తమ ఆధార్ కార్డులను లైన్లలో పెట్టిన దృశ్యాలను సోమవారం తన ఎక్స్ ఖాతాలో ఉదహరిస్తూ సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మొన్న మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ కోసం పోలీసులు టోకెన్లు జారీ చేస్తే, నేడు జగిత్యాలలో రైతులు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన పరిస్థితి నెలకొన్నదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో రైతే రాజుగా ఉన్న తెలంగాణలో రైతులను నట్టేట ముంచి, నడిరోడ్డు మీదికి తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఫైర్ అయ్యారు. రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని విమర్శించారు. రైతు డిక్లరేషన్ అని దగా చేసి, రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్ పేరిట మోసం చేశారని, దేశానికి అన్నంపెట్టే రైతన్న కంటనీరు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం కండ్లు తెరిచి రైతాంగానికి యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న పత్తి రైతులు

## మళ్లీ రోడ్డెక్కిన పత్తి రైతులు

- కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్
- చెన్నూర్‌లో ప్రధాన రహదారిపై ధర్నా

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 24 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ సమీపంలోని కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో సోమవారం పత్తి కొనుగోళ్లు నిలిపివేయడాన్ని నిరసిస్తూ చెన్నూర్–మంచిర్యాల ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేశారు. చెన్నూర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ పత్తి కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేస్తున్నాడని ఇటీవల ఆయన్ను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. ఆ బాధ్యతలను జిల్లా మార్కెటింగ్ అధికారికి అప్పగించారు. డీఎంవో డిజిటల్ సైన్ చేయడం లేదని సీసీఐ అధికారులు రెండు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిపివేశారు. అధికారుల తీరుకు నిరసనగా వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి రైతులు రెండు గంటలపాటు ధర్నా చేశారు. దళారులు సీసీఐ అధికారులు కుమ్మక్కై ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. డీఎంవో చేరుకొని డిజిటల్ సైన్ చేస్తానని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

## మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మార్కెట్‌లో పడిపోతున్న ధరలు
- అదనంగా క్వింటాకు 10 వేలివ్వాలి
- మిర్చి రైతుల ఆవేదన పట్టదా?
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట, ఫిబ్రవరి 24: మిర్చి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పడిపోతున్నాయని, మార్కెట్ ధరతో పాటు రైతులకు అదనంగా క్వింటాల్‌కు రూ.10వేలు అందించాలని డిమాండ్‌చేశారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మిర్చి రైతుల విషయంలో చేతులెత్తేసిందని మండిపడ్డారు. నిరుడు రైతులు పండించిన మిర్చి పంట ఉత్పత్తులు సైతం కోల్డ్ స్టోరేజీలోనే ఉన్నాయని తెలిపారు. రెండు నెలలుగా మిర్చి రైతులు మద్దతు ధర లేక అల్లాడుతున్నారని చెప్పారు. అంతర్జాతీయంగా నాణ్యతతో కూడిన మిర్చిని వరంగల్, తెలంగాణ జిల్లాల రైతులు పండిస్తున్నా మార్కెట్లో మిర్చికి కనీస మద్దతు ధర రాకపోవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మిర్చి రైతులకు అండగా ఉంటుందని తెలిపారు.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు భారీగా వచ్చిన మిర్చి బస్తాలు

## ఎనుమాముల మార్కెట్‌కు లక్ష బస్తాల మిర్చి

రఘునాథపాలెం/ కాశీబుగ్గ, ఫిబ్రవరి 24: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సోమవారం లక్షకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు మార్కెట్‌కు 3లక్షల 70క్వింటాళ్లకు (7లక్షల బస్తాలు) పైగా మిర్చి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. తేజ రకం క్వింటాకు 13,500, వండర్‌హాట్ 16,200, దీపిక 17,300, దేశీ రకం మిర్చి 27వేలు, సింగిల్ పట్టి 26వేలు, బ్యాడ్గీ రకం 24వేలు, మధ్య రకం రూ.22వేలు, తాలు రకం 6వేలు ధర పలికాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఎర్ర బంగారం పోటెత్తింది. రైతులు 1.05 లక్షల బస్తాలను తీసుకొచ్చారు. మిర్చి ధర రూ.14,125 పలికినా క్వింటాకు 500 నుంచి 1000 తగ్గించి కొనుగోళ్లు జరిపారు.

## • రెండెకరాలున్నా.. రైతుభరోసా రాలె




తమకు రెండెకరాలు ఉన్నా ఇంకా రైతుభరోసా రాలేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం గుంటిపల్లి, దేవరపల్లి, మోట్లంపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సోమవారం వ్యవసాయ కార్యాయానికి చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు ఆఫీస్‌కు రాగా.. అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కడే వేచి ఉన్నారు. ప్రభుత్వం మూడెకరాల వరకు పంట పెట్టుబడి సాయం అందించినట్టు చెప్తున్నా రెండెకరాలు ఉన్న తమకు ఇంతవరకు ఖాతాల్లో డబ్బులు పడలేదని ఆవేదన చెందారు. – అమరచింత

## • రైతుభరోసా రాలేదని ఆందోళన



రైతుభరోసా రాలేదంటూ రంగారెడ్డి జిల్లా మంచాల మండలం బండాలేమూర్‌కు చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇటీవల గ్రామసభలు నిర్వహించి తాము సాగుచేయటంలేదనే నెపంతో రైతుబంధు ఇవ్వటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. – రంగారెడ్డి

# ఒకేరోజు ముగ్గురు!




మొదటిపేజీ తరువాయి...

చేశాడు. రూ.1.50 లక్షలు అప్పు చేసి కొడుకును రెండేండ్ల క్రితం దుబాయ్ పంపించగా.. అక్కడ పనిలేక ఆరు నెలలకే తిరిగొచ్చాడు. నిరుడు తొమ్మిదెకరాల్లో పంట పండింది. చేతికొచ్చిన దశలో వడగళ్ల వానతో పంట మొత్తం రాలి రూ.1.50 లక్షల నష్టం వాటిల్లింది. ఈ ఏడాది నక్కవాగుకు నీళ్లు రాక భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. వరుస తడులతో పొలం కాపాడుకుంటూ అక్కడడే ఉంటున్నాడు. బావుల్లో నీరు అడుగంటి పంటలు ఎండుతుండటంతో ఆవేదన చెందాడు. 10 లక్షల వరకు ఉన్న అప్పు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందాడు. ఆదివారం రాత్రి పొలం వద్దకు వెళ్లిన దేవయ్య పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

### వీరారెడ్డిపల్లిలో నీళ్లు లేక పంట ఎండిందని..

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లికి చెందిన రైతు మంద చంద్రయ్యకు మూడున్నర ఎకరాల భూమి ఉన్నది. బస్వాపూర్ జలాశయం ప్రధాన కాల్వ నిర్మాణంలో 2 ఎకరాల భూమిని కోల్పోయాడు. ఎకరంన్నరలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇద్దరు కూతుళ్ల పెండ్లిళ్లు చేయడంతోపాటు బోర్లు వేయడంతో రూ.14 లక్షల అప్పు అయ్యింది. పత్తి పంట దిగుబడి రాలేదు. వరి పంట ఎండిపోయింది. అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో ఆదివారం పొలం వద్ద పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గాంధీ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

### దిగుబడులు రాక రాజు ఆత్మహత్య..

అప్పుల బాధతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో రైతు అరికాంతపు రాజు (38) ఆత్మహత్య చేసుకున్నాడు. రాజు తనకున్న మూడెకరాల్లో మిర్చి, పత్తి పంట సాగు చేశాడు. పెట్టుబడి కోసం 25 లక్షల అప్పు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. మిరప తోటకు నీళ్లు పెట్టి వస్తానని ఇంట్లో నుంచి ఆదివారం రాత్రి వెళ్లాడు. ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తోటకు వెళ్లి చూసేసరికి వేప చెట్టుకు ఉరివేసుకొని కన్పించాడు.

### బ్యాంకోళ్లు రుణమిస్తలేరనే బెంగతో..

బ్యాంకు అధికారులు రుణమిస్తలేరనే బెంగతో సంగారెడ్డి జిల్లాలో ఓ రైతు గుండెపోటుతో మృతిచెందాడు. కల్హేర్ మండలం మాసాన్‌పల్లికి చెందిన బుజ్రంపల్లి దుర్గయ్య (74) కల్హేర్‌లోని ఎస్‌బీఐలో 47,637 పంట



జెల్ల దేవయ్య(ఫైల్)



దుర్గయ్య (ఫైల్)

రుణం తీసుకున్నాడు. 2015 నాటికి వడ్డీతో కలిపి రూ.68 వేలు అయింది. 'నీ డబ్బులు మొండి బకాయి కింద జమ అయింది. రుణం చెల్లిస్తే తిరిగి వెంటనే మంజూరు చేస్తాం' అని బ్యాంకు అధికారులు చెప్పారు. దుర్గయ్య అప్పుచేసి నిరుడు నవంబర్‌లో రూ.68 వేలు చెల్లించాడు. రుణం కోసం మూడు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాడు. మూడు రోజుల కింద బ్యాంకుకు వెళ్లి రుణం ఇస్తారా లేదా? అంటూ అధికారులను ప్రశ్నించాడు. అటు రుణమాఫీ పైసలు రాకపోగా చెల్లించిన డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం బోరుబావి వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. చిన్న కోడలు పశువులకు నీళ్లు పెడతామని పొలానికి వెళ్లింది. దుర్గయ్య నిద్రలో ఉన్నాడనుకొని లేపడానికి ప్రయత్నించింది. ఎంతకూ లేవకపోగా అప్పటికే చనిపోయినట్టు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. బ్యాంకు రుణం ఇవ్వకపోవడంతోనే బెంగతో హఠాన్మరణం చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.



## రైతులు కన్నీళ్లు పెడుతున్నా పట్టించుకోరా?

### ఎన్నికలప్పుడు ఓట్ల కోసం కన్నీళ్లు పెట్టుకుని మోసం చేస్తరా: సుంకె రవిశంకర్

రామడుగు, ఫిబ్రవరి 24 : ఒకవైపు పంటలు ఎండుతూ రైతులు కన్నీళ్లు పెడుతుంటే ప్రభుత్వ యంత్రాంగం కనీసం పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొరటపల్లి శివారులోని ఎండిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికలప్పుడు ఓట్ల కోసం శోకం పెట్టుకున్నారని గుర్తుచేశారు. గెలవకపోతే తన చావునే చూస్తారన్న మేడిపల్లి సత్యం.. ఇప్పుడు రైతు కన్నీళ్లు పెడుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క ఎకరా కూడా పంట ఎండిపోకుండా పూర్తి స్థాయిలో నీటిని అందించామని, ఈరోజు రామడుగు వాగును చూస్తే ఎడారిలా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పంట నష్ట పోయిన ప్రతి రైతన్నకు పరిహారం అందే దాకా వదిలిపెట్టమని హెచ్చరించారు. ఏ గ్రామానికి వెళ్లినా.. 'పంటలు ఎండుతున్నాయి.. నీరందించండి మహాప్రభో' అంటూ రైతులు కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.